మె హ్రా రా ని

శాంతి వేదికమీద కెక్కి ఉపన్యాసమిస్తున్నది. ముగ్ధమోహన రూపం - ఔత్తరాహుల సౌందర్యం-ఆమె విగ్రహము పొడవైనది. అందానికి మెరుగులు దిద్దే అలంకరణ చేసుకున్నది. ప్రింటెట్ నైలక్సు చీరె ధరించింది. ఆ చీరె కట్టూ భుజాలు దాటీ దాటని ఒత్తైన నల్లటి తలవెంట్రుకలూ, వాటిని రెండు భాగములుగా చేసి రిబ్బన్లతో సంబంధించబడిన చిన్నచిన్న జడలు, ఎడమచేతి కొక ప్లాస్టిక్ గాజూ కుడిచేతికొక రేడియమ్ డయల్ వాచీ, కనుబొమ్మలమధ్య తిలకంబొట్టు - ప్రేక్షకుల దృష్టిలో ఒక చిత్తరువులా నిలిచింది.

చక్కటి శైలి. అంతకంటె చక్కని ఉచ్చారణ - శ్రావ్యమైన కంఠం ప్రేక్షకులను ముగ్ధులను చేసింది.

"వివాహాల విషయం-యువకుని మనసుమీద విశ్వాసాల (సెంటిమెంట్సు) ప్రభావ మెక్కువా? సంస్కారం భావాల ప్రభావా మెక్కువా? ఏవి ఎక్కువ పని చేస్తాయి? చేస్తే ఎంతకాలం?'' ఈవిషయం పైన చర్చ. చర్చలో పాల్గొన్నవారు ఆరుగురు - వారిలో ఇద్దరు విద్యార్థినులు. ఆంగ్గభాషలో రసవంతంగా సాగుతున్నది చర్చ.

శాంతి చర్చా వేదిక పైకి రాగానే అందరూ చకితులై ఆమెను చూస్తున్నారు. ఆమె చెప్పేదే వింటున్నారు.

"గుండె బలంగల యువకుడు చిత్తశుద్ధితో దృఢ నిశ్చయం చేసుకుంటే సంస్కారం నిలబడుతుంది; మనోబలం లేకపోతే దృఢ నిశ్చయం కూడ కొంత కాలానికి సడలిపోతుంది. విశ్వాసాలు దానిచోట స్థావర మేర్పరచుకుంటాయి" ఇది ఆ చర్చలోవి సారాంశము. దీన్నే సోదాహరణంగా చర్చించింది. ఎందరో యువకులు మొదట సంస్కారమనే బులుపుతో కులాంతర మతాంతర వితంతు వివాహాలు చేసుకుంటారనీ ఆ బులుపు తీరగానే వారిలో విశ్వాసాలు చోటు చేసు

కోగా చాలామంది తమ వైవాహిక జీవితాలను నరకప్రాయంగా చేసుకుంటున్నారని_మానవ జీవితంలో విశ్వాసాలకున్న బలం దేనికీ లేదని - యువకులకు ఆత్మస్థైర్యము కావాలని అది ఉంటే విశ్వాసాలను జయించ వచ్చునని శాంతి కంఠం మారుమ్రోగినది - కళాశాల ఆవరణ మంతా.

ప్రేక్షకలోకంలో విద్యార్థులు, ఉపాధ్యాయ వర్గము, పురజనులు. ఉన్నారు. అందరికి ఆనందానికి మరోమెట్టు పైన ఉన్న అనుభూతి కలిగినది. అంతా తన్మయులైపోతున్నారు. ఆమె విగ్రహం చాలామంది హృదయాలలో ముద్రపడి పోయింది.

విద్యార్థిలోకంలో వాళ్ళకు కలిగిన అనుభూతి - ఉపాధ్యాయ వర్గంలో కొందరికి కలిగిన అనుభూతి అంతలో క్షణికమయిపోయినది. వాళ్ళ అనుభూతిలో ఏదో వెలితి. ఏదో అసంతృప్తి.

ఆమెకు అందం ఉండచ్చు - ఆధునిక విద్యానాగరికత ఉండచ్చుగాని ఆ పిల్ల మెహ్తర్ల పిల్ల ?

ఆ సంగతి మనసులోకి రాగానే దుర్వాసన! వాళ్ళ ముఖాలలో అప్పటి కప్పుడు రంగులు మారుతున్నాయి.

సభ ముగిసే వరకూ మురళీమోహను కళ్ళ కొక అనుభూతి, నాసిక కొక అనుభూతి రెండూ పరస్పర విరుద్ధంగా ఉండి ఘర్షణ పడుతూనే ఉన్నాయి. ఈ విభిన్న దృక్పథాల మధ్య అర్భకుడైన మురళీమోహన్ నలిగిపోతున్నాడు

ఈ చర్చంతా కృతకమే. ఇవన్నీ చిలక పలుకలే కాని యువకుల హృదయాలమీద వాటి ప్రభావ మెంత? వాటి బలమెంత?

మామూలే. రోజూ ఎన్ని నీతులు వినటంలేదు? కూటికోసం కొందరు - గౌరవ మర్యాదల కోసం కొందరు ఉన్నతికి కొందరు - ఇదిగో ఈ విద్యార్థినీ విద్యార్థులు బహుమతుల కోసం? అంతేగా? ఇలా సాగుతున్నాయి. అతడి మనసులో ఊహలు.

ఆ సంవత్సరం ప్రారంభంలో మొట్టమొదటిసారిగా తను బాటనీ క్లాసు రూంలో అడుగు పెట్టాడు. పాఠం చెబుతూ మధ్యలో బోర్డుమీద ఏదో వ్రాయా

లని లేచి చూసేసరికి క్రిందుగా ఒక బొమ్మ వేసి ఉంది ఆపరేషన్ చేసేటప్పుడు డాక్టర్లు నోటికి ముక్కుకు కలిపి కట్టుకునే మాస్కుతో ఒక ఆడపిల్ల బొమ్మ. దాన్ని చూడనట్టే పాఠం చెబుతూ క్లాసు నాలుగు మూలలా చూశాడు. ముందు సీట్లో ఇద్దరు చేతి గుడ్డలను అలా కట్టుకొని కూర్చున్నారు మురళీమోహన్ అదంతా గమనించనట్టే పాఠం పూర్తిచేసి "మీలో చాలామంది మెడిసిన్‌లో సీటు దొరక్క ఇక్కడికి వచ్చారని నాకు తెలుసు. థియేటర్‌లోనికి వెళ్ళి ఆపరేషన్ చేయాలని ఎంతో సరదా పడుతున్నట్టు కూడా నాకు తెలుసు" అంటూ బోర్డు తుడిచి అందరివి ఒకసారి అనుమానంగా చూసి నవ్వుతూ వెళ్ళాడు క్లాసు రూంలోనుంచి

అతడా కార్టూను చూడగానే గ్రహించాడు. ఎవరిని చూసి వేసిందీను. అది మూడు మూర్తులా శాంతిబొమ్మ శాంతి అందానికి అతడి హృదయం తబ్బిబ్బవుతుంది. ఆమెకు సన్నిహితం కావాలనీ. పాఠం చెప్పే నెపంతో పలకరించాలని ఇంకా ఏమేమిటో కలలుకంటుంది కాని మన్మథకృష్ణ శాంతిని గురించి చెప్పిన తరువాత మనసంతా అదోలా అయిపోతున్నది. ఆమె మీద అభిమానమంతా వెగటుగా మారిపోతున్నది. బుద్ధికీ హృదయానికి మధ్య సంఘర్షణ భరించరానిదిగా ఉన్నది

మన్మథకృష్ణ క్లాసులో శాంతిని చూపిన తరువాత ఈ పిల్లను ఎక్కడ చూశానా అని మథన పడిపోయాడు. గోవిందరాజన్ సరోజనీదేవీ నగర్ కాలనీ నుంచి వస్తాడు. అది కొత్త కాలనీ. అలవాటు చొప్పున మరుగుదొడ్లు కడిగే మెహ్తర్ల కోసం ఎదురు చూశారు ఆ కాలనీ వాళ్ళు. పదిరోజుల వరకూ ఏవరి దొడ్లు వాళ్ళే కడుక్కోవలసి వచ్చింది. గాంధీ సూత్రాలను గట్టిగా నమ్మిన వాళ్ళు "మనపని మనం చేసుకుంటే ఏం ?" అనుకున్నారు. కనబడిన వాళ్ళకు చెప్పారు. కాని కొందరు ఇంట్లో పనిచేసుకొని కూడా అది గౌరవ భంగమనుకుని చెప్పలేక పోయారు. అలా అందరు మెహ్తర్‌కోసం అలమటించి పోతున్న సమయంలో ఇరవై ఏళ్ళ అబ్బాయి. పదిహేనేళ్ళ అమ్మాయి పాయిజామా కుడతా ధరించి సైకిల్ మీద వచ్చేరు. అమ్మాయి తలమీదుగా ఓణీ కప్పుకుంది ముఖం పూర్తిగా కనబడ లేదు.

ఆ కాలనీ వాళ్ళంతా "ఇంటికి రెండేసి రూపాయలిస్తాం పాకీవాళ్ళను పంపించ"మని చెప్పారు. ఆ మరునాటినుంచీ ఆ అన్నాచెల్లెళ్ళు ఉదయం ఐదు గంటల

నుంచి ఎనిమిది గంటలవరకూ దొడ్లు తుడిచేవారు. కొన్ని ఇళ్ల మిగిలిపోతే సాయం త్రంపూట వచ్చి తుడిచేవారు అవి డ్రైనేజిదొడ్లు. నీళ్లు పోసి చీపురుతో గబగబా కడిగేసి వెళ్ళేవారు. ఆడపిల్ల కొంగుచాటున చీపురు పుట్టుకుని నీళ్ల నీళ్ళు అంటూ ఉండేది. ఇంట్లో ఎవరో పోసేవారు. ఒకనాడు మన్మధకృష్ణ పోశాడు ఆమె ముఖం సరిగా కనబడలేదు. మూడోనాడూ నాలుగోనాడూ తానే నీళ్ళుపోస్తూ ముఖం బాగా తేరిపార జూశాడు.

ఆ కార్టూను చూసేంతవరకూ విద్యార్థులు ఆమెతో మాట్లాడాలనీ ఆమె మాట్లాడుతుంటే వినాలనీ ఉవ్విళ్ళూరే వారు. విద్యార్థినులు ఆమెను మధ్యగా కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పుకునేవారు. అప్పుడప్పుడు ఆమె టిఫిన్ డబ్బా తెరచి ఆమె తెచ్చుకున్న పూరీకూరా తీసుకు తిని ఆమెకు అన్నం పేట్టేవారు.

కార్టూను చూసి శాంతి భయపడిపోలేదు. తన తల్లి డ్రైనేజి లేనిచోట దొడ్లు తుడిచేటప్పుడు అలా ముక్కుకు గుడ్డ కట్టుకుంటుంది. అదొక వృత్తి, ఆ వృత్తికి మాత్రం గౌరవంలేదా ?

కాని-కార్టూను తరువాత శాంతి ఒంటరిదయిపోయింది. ఇప్పుడామెకు సమీపంగా ఎవరూ రారు దూర దూరంగా పోతున్నారు. శాంతి ఇంటికి వచ్చి అన్నకు చెప్పుకుని భోరున ఏడ్చింది.

లక్ష్మణ్‌ను చూసిన వాళ్ళు అతడు ఏ తెల్లదొర సంతానమో అనుకుంటారు. అతడు శాంతి చదువుకునే కాలేజి ప్రిన్సిపల్ గదిలోకి వచ్చి "సర్. నేను మీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు.

ప్రిన్సిపల్‌కు రెండు అంగుళాల పొడుగున డిగ్రీలు ఉన్నాయి. కాని కాలాన్ననుసరించి విద్యార్థులంటే మనసులో భయంభయంగా ఉంటుం దాయనకు.

లక్ష్మణ్ తన చెల్లెలికి జరిగిన అవమానాన్ని గురించి చెప్పి "అందరి హక్కులూ కాపాడవలసినవారు మీరు. నాచెల్లెలి కిక్కడ అవమానం జరిగితే ఫలితాలు బాగుండవు" అన్నాడు.

లక్ష్మణ్ టెరిలిన్ షర్టు టెర్రికాట్ పాంటూ-ఖరీదైన బూట్లూ జేబులో ఖరీదయినకలమూ-హుందాగా ఉన్నాడు.

తను చూస్తున్న దానికీ విన్నదానికీ పొత్తుకుదరక తెల్లబోతూ "నీవేం చేస్తున్నా''వని తను కాస్త ధైర్యాన్ని పుంజుకోడానికి ప్రయత్నించాడు పిన్సిపల్.

''మెడికల్ కాలేజిలో మూడవ సంవత్సరము'' అన్నాడు లక్ష్మణ్.

"చాలా సంతోషం. నేను ఇక్కడి విషయాలను అదుపులో పెడతాను" అంటూ లేచి లక్ష్మణ్‌తో కరచాలనం చేసి—అతడు వెళ్ళిన తరువాత అమ్మయ్య అనుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు ప్రిన్సిపల్.

నలుగురు ఆడపిల్లల మధ్యన అపురూపంగా పుట్టిన లక్ష్మణ్‌ను చూసి తండ్రి మురిసిపోతూ వీడిచేత చీపురు పట్టించకూడదనుకున్నాడు. ముద్దుగా పెంచి చదువు చెప్పించాడు. కాని కొడుకు కాలేజిలో ప్రవేశించగానే కాలూ చెయ్యి పడిపోయి మంచానపడ్డాడు. తల్లి ఒకతె పనిచేయగా వచ్చేరాబడి చాలటంలేదు లక్ష్మణ్ తరువాత పుట్టిన శాంతి అన్నతో కూడా చదువులో ప్రవేశించింది.

కాలేజీలో అభ్యుదయ ఉత్సవాలు జరిగి వారం రోజులయినా అందరి కళ్ళల్లో ఆదృశ్యాలే ఇంకా మెదులుతున్నాయి. అందరి చెవుల్లో ఆ ఉపన్యాసాలూ ఆ నాటకాలలో పాటలూ పద్యాలూ ఇంకా మారుమ్రోగుతూనే ఉన్నాయి.

ఆ కాలేజిలో తెలుగు లెక్చెరరు ముకుందం ఆనాటి నుంచి ఏమిటోగా ఉంటున్నాడు. సాధారణంగా తెలుగు లెక్చెరర్లమీద విద్యార్థులకుండే గౌరవముకంటె ఆ కాలేజిలో అతడికెక్కువే గౌరవముంది. అతడెప్పుడూ తెలుగులో మాట్లాడడు. ఎప్పుడూ ఫుల్ సూటులో ఉంటాడు. ఈ రెండు కారణాలతో గౌరవాన్ని సంపాదించాడు. అభ్యుదయ ఉత్సవాలలో విద్యార్థులకు ఉపన్యాసాలను తయారుచేసి ఇచ్చాడు. వాళ్ళల్లో ఒక్కరికయినా ప్రైజు వస్తుందని నమ్మాడు. కాని వాళ్ళకు రాలేదు. ఆ ఓటమి తనదిగా భావించాడు. మనసు చిన్నబోయినట్లయింది.

కాని అది క్షణికమే. వేదిక మీదికెక్కి ఉపన్యాసం ఇచ్చిన శాంతి రూపం-ఆమె వచో మాధుర్యం-దాని సారాంశం అతడి బాధను మరిపింప చేస్తున్నాయి. ఆ అజంతా సుందరి తనను ఓడించేసింది. కాని ఆ ఓటమి కూడా ఎంతఆనందాన్ని ఇస్తున్నది! ఆమెకు ఎవరో కాచివడబోసిన అనుభవాన్ని చక్కగా బోధించారు. ఆమె తీయటి కంఠంతో వెలిబుచ్చటమే అతడికెంతో ముచ్చటగా ఉంది.

ఋతువులు మారుతున్నాయి. ముకుందం ఆలోచనలు ఒక రూపానికి వచ్చాయి. అతడీమధ్య నరేంద్ర పండిట్ దగ్గరకెళ్ళి తనకు ఆరు నెలల్లో హిందీ భాష నేర్పమని కోరాడు. "నేను సంస్కృతం వచ్చినవాడిని. ఆ లిపి కూడా వచ్చు. భాష రావాలి" అన్నాడు. నరేంద్ర పండిట్ వయోజన విద్యా ప్రణాళికా రచనలో సిద్ధహస్తుడు. రెండు మూడు నెలలలోనే సంభాషణా కౌశలాన్నీ-ఉపన్యాసాలయినా అర్థం చేసుకునే శక్తినీ ప్రసాదించాడు

ముకుందం ఆత్మస్థైర్యాన్ని కలిగించుకుంటున్నాడు. అతడి కళ్ళ ఎదుట అనేక దృశ్యాలు కదలిపోతున్నాయి. అమెరికా దేశం నుంచి రీసర్చి స్కాలరుగా మదరాసు వచ్చి మూడు సంవత్సరాలు గానకళ నభ్యసించిన జాన్ హిగ్గిన్స్ చక్కని ఉచ్చారణతో భావయుక్తముగా కీర్తనలు పాడి గురువులనే గాక భారతీయుల నందరినీ మెప్పించిన అతడి మూర్తి-జరీ అంచుల దోవతి అడ్డకట్టు-సరిగంచుల ఉత్తరీయము ముఖానబొట్టు తమిళ గాయకుడిలా మెదిలాడు. ఆ చిత్రం మారి మరొక దృశ్యం. ఆమెరికా దేశస్తురాలు కుమారి రాక్వెన్ ఆలయ నృత్యాలు. ఆమె భారత దేశానికి వచ్చి అనుకరించిన భారత స్త్రీల కట్టూబొట్టూ ఆ అలంకరణ కళ్లు చెదరి పోతున్నాయి. పాశ్చాత్యులే మన దేశానికి వచ్చి మన పద్ధతుల నవలంబించి మనలో కలిసిపోయి మన ఔన్నత్యాన్ని విదేశాలలో చాటుతుంటే మనదేశం మన జాతి-వర్గ భేదమున్నంత మాత్రాన మెహ్తారా పిల్ల తనకు అర్ధాంగి కాలేదా? శాంతి రూపము అనేక భంగిమలలో అతడిని గిలిగింతలు పెట్టడం మొదలు పెట్టింది.

ముకుందం అభిలాష వినగానే లక్ష్మణ్ ఎగతాళి క్రింద జమకట్టాడు. వారం రోజుల పాటు ప్రతి సాయంకాలం దానిలోని కష్టనిష్ఠూరాలను వర్ణించి చెబుతూ వచ్చాడు. ఆఖరి రోజున "మీ మన స్థైర్యాన్ని అభినందించకుండా ఉండలేక పోతున్నా" నన్నాడు.

ముకుందం మూడు పూటలా గాయత్రిని జపిస్తాడు. ఆ దేవతే తనకా మన స్థైర్యాన్నిస్తోందని అతడి నమ్మకము.

తరువాత పది రోజులకు ప్రిన్సిపల్ దంపతులనూ లక్ష్మణ్‌ను కూడా రిజిస్ట్రార్ ఆఫీసుకు తీసుకువెళ్లి శాంతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ సాయంకాలము

ప్రిన్సిపల్ క్వార్టర్సు ముందర పెద్ద షామియానాలో విద్యార్థులకూ స్టాఫుకు పెద్ద విందు జరిగినది. ప్రిన్సిపల్ భార్య అనితాసింగ్ అన్ని ఏర్పాట్లు చేసింది. వధూవరులు టెర్రిలిన్ నైలక్సు దుస్తులలో గులాబీ దండలతో మెరిసి పోతున్నారు. మెర్క్యూరీ లైట్ల కాంతిలో ఆహూతులందరికీ ఈ పెళ్ళి గురించి ఏమనటానికి నోరు రావటంలేదు. పచ్చి వెలక్కాయ గొంతున పడినట్టున్నది. అయినా నవ్వుతూ వధూవరులకు కరచాలనం చేశారు.

అందరి పరిస్థితిలాంటిది కాదు మురళీమోహన్‌ది. అతడి ముక్కు ముడతలు పడిపోతున్నది. కనుబొమలు ఆత్మీయంగా కలుసుకుంటున్నాయి. ఆవేదనకు అంతులేదు కాని-ఈనాడు ముక్కు ముడతలు పడటం అసహ్యం కొద్ది కాదు. తనకు ఆత్మస్థైర్యం లేనందుకు - గుండె బలం లేనందుకు-పరిస్థితులు చెయ్యి జారిపోయినందుకు.

“తీపి తిని నవ దంపతులను దీవించండి” అంటూ అనితాసింగు ఇచ్చిన ఐస్క్రీం అతడికి వేడివేడిగా చేదుచేదుగా ఉంది. నవ్వుతూ అందరితో కరచాలనం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్న వధూవరులవైపు కళ్ళెత్తి చూడలేకపోయాడు.

[1978 లో ఆంధ్రప్రదేశ్ (స్వాతి) సాహిత్య అకాడమీవారి కథా సంకలనంలో చేర్చబడినది.]